సాక్షి
హనుమకొండ
గురువారం । 29 । జూన్ । 2023



జీనోమ్ ఎడిటింగ్‌తో...

మొక్కల జన్యు నవరణలతో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని ఆస్ట్రే లియా ముర్డోక్ వర్సిటీ సైంటిస్ట్ ఎంజీకే జోన్స్ అన్నారు.

- 8లో▸



కామన్ సర్వీస్ సెంటర్లుగా పీఏసీఎస్‌లు

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యలో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
35^0 /26^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం చల్లాగా ఉం టుంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎంసెట్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ షురూ !



కేయూ క్యాంపస్ : కేయూలోని అడ్మిషన్ల డైరెక్ట రేట్‌లో, హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎంసెట్ అభ్యర్థు లకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ బుధవారం ప్రారం భమైంది. ఈనెల 26 నుంచి స్లాట్ బుకింగ్ చేసుకున్న అభ్యర్థులు వెరిఫికేషన్‌కు హాజరవు తున్నారు. కేయూలో జూలై 6 వరకు, ఆర్ట్స్ అం డ్ సైన్స్ కళాశాలలో జూలై 4 వరకు వెరిఫికేషన్ కొనసాగుతోంది. వెబ్ ఆప్షన్లు కూడా బుధ వారంనుంచి ఇచ్చుకునే అవకాశం కల్పించారు. ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ అయిలయ్య పాల్గొని సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకున్న అభ్య ర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

గ్రూప్‌-4 పరీక్షకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

హన్మకొండ: టీఎస్ పీఎస్సీ గ్రూప్‌-4 పరీక్షకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపనుంది. అభ్యర్థు లు పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఆర్టీసీ రవాణా సౌకర్యా న్ని కల్పిస్తోంది. జూలై 1న ఉదయం 5 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రాలకు చేరవే సేలా చర్యలు తీసుకుంది. అభ్యర్థులు ఆర్టీసీ బస్సులో ప్రయాణించి పరీక్ష రాసి తిరిగి భద్రం గా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆర్టీసీ వరం గల్‌-1 డిపో మేనేజర్ పి.శ్రీనివాస్‌రావు కోరారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కేయూ పరిధిలోని అన్ని పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈనెల 30న జరగాల్సిన డిగ్రీతో సహా ఇతర పరీక్షలు వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్ర ణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ బుధ వారం తెలిపారు. జూలై 1న గ్రూప్‌-4 పరీక్ష ఉన్నందున ఈనెల 30న జరగాల్సిన పరీక్షలన్నీ వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఆయా పరీక్ష లు ఎప్పుడు నిర్వహించేది తర్వాత వెల్లడిస్తా మని తెలిపారు. మిగతా పరీక్షలు టైంటేబుల్ ప్రకారమే జరుగుతాయని ప్రకటించారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు డీబార్

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కోర్సుల నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో వివిధ పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ పట్టుబడి ఐదు గురు విద్యార్థులు డీబార్ అయ్యారని అధికారు లు పి.మల్లారెడ్డి, ఎ.నరేందర్ తెలిపారు.

‘రెగ్యులరైజేషన్’పై సానుకూలంగా సీఎం



కేయూ క్యాంపస్ : రాష్ట్రంలోని వివిధ యూనివ ర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల రెగ్యులరైజేషన్ ప్రక్రియపై సీఎం సానుకూలం గా ఉన్నారని, వారి ప్రక్రియ కోసం తాను కేబినెట్ సభ కమిటీ భేటీకి సమయం తీసుకుం టానని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హామీ ఇచ్చినట్లు కేయూ కాంట్రాక్టు అ సిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ బాధ్యులు తెలిపారు. బుధ వారం హైదరాబాద్‌లో మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రిని వేర్వేరుగా కలిశారు. మంత్రి సబితా సానుకూలంగా స్పం దించినట్లు తెలిపారు. కలిసిన వారిలో కేయూ కాంట్రాక్ట్ అధ్యాపక జేఏసీ చైర్మన్ డాక్టర్ పి కరుణాకర్‌రావు, రాజేష్, నిరంజన్, రాజు, డాక్టర్ లింగయ్య తదితరులు ఉన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

హన్మకొండ: యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రాయాలనుకునే ఆసక్తి కలిగిన అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థు లు ఉచిత శిక్షణకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అధ్యయన కేంద్రంలో దరఖాస్తు చేసు కోవాలని వరంగల్ ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి తెలిపారు. హైద రాబాద్ బంజారాహిల్స్ రోడ్ నంబర్‌-14లోని కేబీఆర్ పార్కుకు ఎదురుగా ఉన్న ఎస్సీ కులాల అభివృద్ధి సంస్థ అధ్యయన కేంద్రంలో సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు ఉచిత శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. గుర్తింపు పొందిన విశ్వ విద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండి వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించకుండా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూలై 2 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచిం చారు. 9న ఉదయం 10.30 నుంచి మధ్యా హ్నం 1.30 గంటల వరకు ఆర్ట్స్ కళాశాలలో ఎంపిక పరీక్ష ఉంటుందని తెలిపారు.




దామెర మండలం కోగిల్వాయిలో నారుమడి కోసం నీరు పెడుతున్న రైతు, కంఠాత్మకూర్ రోడ్డులో పత్తిచేలో గుంటుక కొడుతున్న రైతు

సాగులో రైతన్న

అడపాదడపా వర్షాలు పడుతుండడంతో రైతు లు సాగు పనుల్లో బిజీబిజీ అయ్యారు. కొం దరు రైతులు ఇప్పటికే నారుపోసుకున్నారు. మరికొందరు నారు పోసేందుకు మడులు సిద్ధం చేసుకుంటుండగా, ఇంకొందరు అలుకు (వడ్లు) చల్లుతున్నారు. పత్తిచేలులో గుంటుక కొడుతున్నారు. పలు గ్రామాల్లో కూలీలు పత్తిలో కలుపు తీస్తున్నారు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్



నడికుడ మండలం దామెర రోడ్డులో నారు మడి



కోగిల్వాయి శివారులో అలుకు చల్లుతున్న..



సంగెం మండలం గవిచర్లలో విత్తనాలు వేస్తున్న రైతులు



వరంగల్‌నుంచి విత్తనాలు తీసుకెళ్తున్న రైతులు



కలుపుతీస్తున్న మహిళా కూలీలు

రచ్చకెక్కిన పంచాయితీ

- రెండేళ్లుగా బాలుర, బాలికల స్కూల్ హెడ్‌మాస్టర్ల మధ్య కొనసాగుతున్న ఘర్షణ
- మండల సభ దృష్టికి తీసుకెళ్లిన సర్పంచ్
- సమస్య పరిష్కరించాలని పాఠశాలకు తాళం



నిర్మానుష్యంగా పాఠశాల ఆవరణ



గేటుకు తాళం వేసి ఉండడంతో గేటు వద్దనే ఉన్న విద్యార్థులు

శాయంపేట : విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పా ల్సిన ఉపాధ్యాయులు రెండేళ్ల నుంచి విద్యార్థుల ఎదుట ఘర్షణ పడుతున్నారు. సర్పంచ్, అధికారు లు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యుల సమక్షంలో పలుమార్లు పంచాయితీ చేసి ఉపాధ్యాయునులకు సర్ది చెప్పినప్పటికీ వారి మధ్య సయోధ్య కుదరడం లేదు. పంచాయితీ పరిష్కారం కావాలని బుధ వారం స్థానిక సర్పంచ్ అబ్బు ప్రకాశ్‌రెడ్డి పాఠశా లకు తాళం వేయడంతో ఈ విషయం రచ్చకెక్కింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దకోడె పాక ప్రాథమిక బాలుర, బాలికల పాఠశాలల భవ నాలు వేర్వేరుగా ఉండగా 2016లో బాలుర పాఠ శాల ప్రాంగణంలోకి తరగతులను మార్చారు. అప్పటినుంచి కోఎడ్యుకేషన్‌తో నడుస్తోంది. ప్రస్తుతం బాలికల పాఠశాల హెచ్‌ఎం మంద శశికళ, ఉపాధ్యాయుడు రఘు, బాలుర పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం అంబాల చంద్రకళ విధులు నిర్వ ర్తిస్తున్నారు. శశికళ, చంద్రకళ, మధ్య రెండేళ్లనుంచి గొడవ కొనసాగుతోంది. ఈ విషయమై సర్పంచ్ పలుమార్లు పంచాయితీ నిర్వహించారు. అయినప్ప టికీ గొడవ సద్దుమనగకపోవడంతో ఎంఈఓ రమా దేవి, ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి సమక్షంలో పంచాయితీ నిర్వ హించగా అధికారులు కలిసి మెలిసి ఉండాలని సూచించారు. అయినప్పటికీ వారు తీరు మార్చుకోక పోవడంతో మండల సభలో సర్పంచ్ ఈ సమ స్యను లేవనెత్తారు. సోమవారం హెచ్‌ఎం శశికళ విద్యార్థులను పాత బాలికల పాఠశాలలోకి తీసుకెళ్లి బోధించింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ మం గళవారం పాఠశాలకు వెళ్లి ఎంఈఓ, ఎస్‌ఎంసీ చైర్మన్ అనుమతులు లేకుండా మౌలిక వసతులు లేకుండా తరగతులు ఏ విధంగా నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. గొడవలు పడుతూ విద్యార్థుల నమోదు శాతాన్ని పడిపోయేలా చేసి, పాఠశాల పేరును చెడగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరువురి హెచ్‌ఎంల పంచాయితీ తేల్చు కొని రావాలని బుధవారం ఉదయం 9 గంటలకు పాఠశాలకు సర్పంచ్ తాళం వేశారు. తాళం వేశా రన్న సమాచారం తెలుసుకున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ రమాదేవి, ఎస్‌ఎంసీ చైర్మన్ మంద శంకర్, కోగిల జగన్, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, సర్పంచ్ ప్రకాశ్‌రెడ్డి అధ్యక్షతన ఉపాధ్యాయుల పంచాయి తీపై చర్చించారు. చివరికి ప్రస్తుతం పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై వేరే ప్రం తానికి పంపించి కొత్త ఉపాధ్యాయులను నియమిం చాలని తీర్మానం చేశారు. విద్యార్థులు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని వేరే ఉపాధ్యాయులు నియమిం చాలని డీఈఓ అబ్దుల్‌హైకి వినతిపత్రం సమర్పించ నున్నట్లు సర్పంచ్ తెలిపారు.

ప్రజలే నన్ను రక్షించుకుంటారు

బీజేపీ నేత, ఎమ్మెల్యే ఈటల రాజేందర్

కాజీపేటరూరల్: తెలంగాణ ఉద్యమంలో నన్ను ప్రజలే రక్షించారని, ఇప్పుడు కూడా ప్రజలే రక్షించు కుంటారని బీజేపీ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. భోపాల్‌లో ‘మేరా బూత్ సబ్‌సే మజబూత్’ శిక్షణ ముగించుకుని ప్రత్యేక రైలులో కాజీపేటకు చేరుకున్న బీజేపీ శ్రేణు లకు ఈటలతోపాటు రాష్ట్ర, జిల్లా నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన విలేక రులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రగతి భవన్ కేంద్రంగా చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, తమ సర్పంచ్‌లపై, కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని అన్నారు. కౌశిక్‌రెడ్డికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి కేబినేట్ హోదా కల్పించడంతో అతను ప్రజలపై దౌర్జన్యా నికి పాల్పడుతున్నాడన్నారు. అతన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఘనస్వాగతం

ప్రత్యేక రైలులో కాజీపేట జంక్షన్‌లో దిగిన వారికి ఈటలతోపాటు రావు పద్మ, కొండేటి శ్రీధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి నాయకు లు విజయరామారావు, రాకేష్‌రెడ్డి, ధర్మారావు, భిక్ష పతి, మురళీధర్‌గౌడ్, చాడ శ్రీనివాస్‌రెడ్డిలు ఎదు రేగి స్వాగతం పలికారు. భోపాల్‌లో శిక్షణ పొందిన 160 మంది కాజీపేటలో దిగారని రావు పద్మ తెలిపారు. వీరు అన్ని జిల్లాల్లో పర్యటించి ప్రజల పరిస్థితులు, కేంద్రంలో ప్రధాని మోదీ పథకాలు అందరికి అందుతున్నాయా లేదా అని గ్రామస్థాయి వరకు తెలుసుకుంటారన్నారు. కార్పొరేటర్లు చాడా స్వాతి, శివమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలకు స్వాగతం పలుకుతున్న ఈటల, జిల్లా, రాష్ట్ర నాయకులు

అమ్మవారికి నీలా, నిత్యాక్రమాల్లో పూజలు



హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరి ఉత్సవాల్లో భాగంగా బుధ వారం ఉదయం అమ్మవారికి నీలా, నిత్యా క్రమాల్లో పూజలు నిర్వహించారు. ఆలయప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, నిత్యా హ్నికం నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త పడిశాల సుజాత అధ్వర్యంలో లక్ష్మీసహస్ర పారాయ ణం చేశారు. దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ కురాకుల జ్యోతి అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు తొలిఏకాదశి

నగరంలోని పలుదేవాలయాల్లో గురువారం తొలిఏ కాదశి పర్వదినం సందర్భంగా పలు ఏర్పాట్లు చేశా రు. వేయిస్తంభాల దేవాలయంలో శ్రీరుద్రేశ్వరస్వా మికి రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ప్రధానార్చ కులు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. అదేవిధంగా పలు వైష్ణవాలయాల్లో పూజలు జరగనున్నాయి.

రైలు ప్రమాదంలో యువకుడి మృతి



శ్రీకాంత్ (ఫైల్)

కమలాపూర్ : మండలంలోని నేరేళ్ల గ్రామానికి చెం దిన ముప్పు శ్రీకాంత్ (25) బీబీనగర్ వద్ద జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ముప్పు రామయ్య-ధనమ్మ దంపతుల కుమారుడు శ్రీకాం త్ హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్ కంపెనీలో ఉద్యో గిగా పనిచేస్తున్నాడు. బుధవారం పండుగ కోసం స్వగ్రామానికి రైలులో వస్తూ డోర్ వద్ద కూర్చున్నాడు. ఈ క్రమంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అతని సెల్‌ఫోన్ లాక్కునే ప్రయ త్నం చేయగా జరిగిన తోపులాటలో ప్రమాదవ శాత్తు శ్రీకాంత్ రైలులో నుంచి కిందపడి అక్కడిక క్కడే మృతి చెందినట్లు తెలిపారు.

బక్రీద్.. పొట్టేళ్లు రెడీ



బక్రీద్ పర్వదినం నేపథ్యంలో వరంగల్ నగరంలోని ఈద్గాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగకు బుధవారం హనుమ కొండ, వరంగల్, కాజీపేటలో గొర్రెపొట్టేళ్ల విక్రయాలు జోరుగా సాగాయి. గురువారం ఉదయం ముస్లింలు ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.

- సాక్షిస్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

కన్నారం.. అక్కన్నపేటలో, ఎర్రబెల్లి.. భీమదేవరపల్లిలో విలీనం

ఎల్కతుర్తి/ధర్మసాగర్ : వేలేరు మండలంలోని కన్నారం గ్రామాన్ని సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో, ఎర్రబెల్లి గ్రామాన్ని భీమదేవరపల్లి మండలంలో కలుపుతూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి కృషి చేసిన సీఎం కేసీఆర్, ఐటీ, మంత్రి కేటీఆర్, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, హుస్నా బాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్‌కు ఆయా గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులందరికీ దళితబంధు అందిస్తాం

పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు : దళితబంధు పథకాన్ని అర్హులందరికీ విడతల వారీగా అందిస్తామని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. బుధవారం హనుమకొం డలోని ఆయన నివాసంలో ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారులు, నియోజకవర్గంలోని ఎంపీడీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులను ఆర్థికంగా బలోపేతం చేయడానికే సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. గురువారం నుంచి పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామెర, గీసుకొం డ, సంగెం మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయం లో, పరకాల మున్సిపాలిటీకి చెందిన వారు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో, జీడ బ్ల్యూఎంసీ పరిధిలోని 15, 16, 17 డివిజన్ల పరిధిలోని వారు జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 58 సంవత్స రాల పైబడిన వారికి ఈ పథకం వర్తించదని తెలిపారు. దరఖాస్తుదారుడి ఆధార్‌కార్డు స్థానిక నియోజకవర్గానికి చెందినదై ఉండాలన్నారు. సమా వేశంలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారులు మాధ వీలత, సురేష్, ఎంపీడీఓలు రాజేంద్రప్రసాద్, అనిత, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, వీరేశం, వెంకటేశ్వ ర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

పకడ్బందీగా గ్రూప్‌-4 పరీక్షల నిర్వహణ

కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్ : టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో జూలై 1న జరగనున్న గ్రూప్‌-4 పరీక్షల నిర్వహ ణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని హనుమ కొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదే శించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో పరీక్షల నిర్వహణపై సూపరింటెండెంట్లు, లైజన్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జూలై 1న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్‌-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్‌-2 పరీక్ష ఉం టుందన్నారు. జిల్లాలో పరీక్షలకు మొత్తం 47,978 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. 161 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు 32 రూట్లలో 32 మంది రూట్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయా లని, జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. అభ్యర్థులు 15 నిమిషాల ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకోవాలన్నారు. కేంద్రాల్లోని గదుల్లో ఉన్న సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. అభ్యర్థు లకు ఏమైనా సందేహాలు ఉంటే టోల్‌ఫ్రీ నం 1800-4251115 ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సం ధ్యారాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

బాధితులకు బాసటగా భరోసా కేంద్రం

వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్

వరంగల్ క్రైం : లైంగికదాడులకు గురైన మహిళలు, చిన్నారులకు భరోసా కేంద్రం బాసటగా నిలుస్తోం దని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. బుధవారం వరంగల్ పోలీస్ కమిషన రేట్ భరోసా కేంద్రం 4వ వార్షికోత్సవం సందర్భం గా సుబేదారిలోని భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. బాధితులకు ప్రభుత్వం నుంచి వచ్చిన పరిహారాన్ని అందించడంతోపాటు, చిన్నా రులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రం 322 మంది బాధితులకు ఆసరాగా నిలవడంతోపాటు, వారికి ప్రభుత్వం నుంచి రూ.1.15 కోట్ల పరిహారాన్ని అం దించినట్లు చెప్పారు. మరో ఎనిమిది మంది బాధి తులకు డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ ద్వారా రూ.14 లక్షలు అందజేసినట్లు తెలిపారు. భరోసా కేంద్రం తీసుకున్న చొరవతో 17 మంది నిందితులకు శిక్షలు పడగా, ఇందులో ఐదుగురికి కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించిందని తెలిపారు. కార్యక్రమం లో క్రైం డీసీపీ మురళీధర్, ఏసీపీ డేవిడ్ రాజు, భరోసా కేంద్రం ఇన్‌స్పెక్టర్ సువర్ణ, మహిళా ఎస్సై లు శ్రావణి, లక్ష్మి, భరోసా కేంద్రం సిబ్బంది సాగ రిక, నవ్య, పవిత్ర, రజిత, సంధ్య, వాసుదేవ్, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న సీపీ రంగనాథ్

పూడిక పేరుకుపోతే వరద నీరు పోయేదెలా?

సాక్షి ఎఫెక్ట్

వరంగల్ అర్బన్ : నాలాల్లో పూడికతీత పనులు ప్రారంభించి, రెండు నెలలైనా ఇంకా వ్యర్థాలు పేరుకుపోవడంపై గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 24న ‘సాక్షి’లో ‘పూడికతీత..పూర్తయ్యేదెప్పుడు’ కథనం ప్రచురితమైంది. కథనానికి స్పం దించిన కమిషనర్ క్షేత్రస్థాయిలో నాలాలను బుధ వారం తనిఖీ చేశారు. వరంగల్ అండర్ రైల్వేగేట్ సాకరాశికుంట, ఎస్ఆర్ఆర్ తోట ఆకారపు వీరలక్ష్మి కాలనీ, శివనగర్, కోటచెరువు, అబ్బనికుంట, ఎల్ బీనగర్, తుమ్మలకుంట, వరంగల్ రైల్వేగేట్ వెంట ఉన్న తదితర ప్రాంతాల్లోని నాలాల్లో పేరుకుపో యిన వ్యర్థాలపై కమిషనర్ ఇంజనీర్లను ప్రశ్నిం చారు. అసంపూర్తిగా నాలాల్లో పూడికతీత చేప ట్టారని, వరద నీరు ఎలా ముందుకు సాగుతుందని మందలించారు. వెంటనే యుద్ధప్రతిపాదికన పేరు కపోయిన పూడిక తొలగించి, ఇరువైపులా ఉన్న కుప్పలను రాంపూర్ డంపింగ్ యార్డుకు తరలిం చాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారాన్ని తొలగించాలని, యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు.



సాకరాశికుంట వద్ద నాలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను పరిశీలిస్తున్న కమిషనర్

క్లుప్తంగా

కస్టడీకి రిటైర్డ్ ఎంపీడీఓ హత్య కేసు నిందితులు



జనగామ సబ్ జైలు నుంచి నిందితులను కస్టడీలోకి తీసుకుంటున్న పోలీసులు

జనగామ: రిటైర్డ్ ఎంపీడీఓ రామకృష్ణయ్య హత్య కేసులో ప్రధాన నిందితుడు గిరబోయిన అంజయ్యతో పాటు శ్రీకాంత్, భాస్కర్‌ను పోలీసులు బుధవారం తమ కస్టడీకి తీసుకున్నారు. వరంగల్ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి మనీషా మెహ్రా నిందితులను రెండు రోజుల పాటు పోలీసు కస్టడీకి అనుమతించిన విషయం తెలిసిందే. 11 రోజులు జనగామ సబ్ జైలులో ఉన్న ముగ్గురు నిందితులను పోలీసులు ఉదయం కస్టడీలోకి తీసుకున్నారు. రామకృష్ణయ్య హత్య కేసు విషయంలో రెండు రోజులు విచారణ చేసిన అనంతరం, వీరిని తిరిగి కోర్టుకు అప్పగించాల్సి ఉంటుంది.

నిట్‌లో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ప్రారంభం



ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్ కెమిస్ట్రీ విభాగ ప్రొఫెసర్ వి.రాజేశ్వర్‌రావు ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం ఆర్గానిక్ అండ్ మెడిసినల్ కెమిస్ట్రీ-23 అంశంపై మూడు రోజుల ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ను కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఇంటర్నేషన్ కాన్ఫరెన్స్‌ను నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ శాస్త్రీయ విధానంతో ఆర్గానిక్ మెడిసిన్‌లో నూతన ఆవిష్కరణలకు వేదికగా ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ నిలవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆన్‌లైన్‌లో ఇజ్రాయిల్‌కు చెందిన నోబెల్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ అదా యోనాథ్, ప్రొఫెసర్లు డి.బసవయ్య, మహేశ్ లక్ష్మణ్, రామాచారి, పటేల్‌గౌహతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాజేశ్వర్ రావు దంపతులను ఘనంగా సన్మానించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్..

దైవాజ్ఞను శిరసావహిస్తూ తన సొంత కుమారుడినే బలి ఇవ్వడానికి సిద్ధమైన తండ్రి.. ఆయన నిర్ణయానికి ఎలాంటి అడ్డు చెప్పకుండాతన ప్రాణం అర్పించడానికి సిద్ధపడిన కుమారుడు.. వీరి భక్తికి ప్రసన్నుడైన దైవం... కత్తిని కుమారుడి గొంతుపై ఎక్కుపెట్టే క్రమంలో ఆయన స్థానంలో దుంబ(గొరెపోతు) ప్రత్యక్షమయ్యేలా చేశారు. దీంతో ఆ రోజును ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ (ఈదుల్ జుహా)పండుగగా జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో గురువారం ఉదయం ఈ పండుగ అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. త్యాగానికి ప్రతీకైన ఈదుల్ జుహా (బక్రీద్) పర్వదినంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

-హసన్‌పర్తి/ కాజీపేట/ఖిలావరంగల్



ఖిలా వరంగల్ ఈద్గా ప్రాంగణం

- నేడు ఈదుల్ జుహా వేడుకలు
- ముస్తాబైన ఈద్గాలు, మజీద్‌లు

ఇబ్రహీంకు అనేక పరీక్షలు..

పూర్వీకుల కథనం ప్రకారం మహ్మద్ ఇబ్రహీం.. దేవుడి (అల్లా) ప్రియమైన భక్తుడు. అతడి భక్తిని పరిశీలించడానికి అల్లా అనేక పరీక్షలు పెట్టాడు. ఓ రోజు దైవం.. ఇబ్రహీం కలలోకి వచ్చి నీ ప్రియమైన కుమారుడు ఇస్మాయిల్‌ను అల్లాకు బలి ఇవ్వాలని ఆజ్ఞాపించాడు. దీనికి ఇబ్రహీం ఏమీ ఆలోచించకుండా భార్యకొడుకును తీసుకుని ఓ నిర్జీవ ప్రదేశానికి బయలుదేరాడు.అయితే మార్గమధ్యలో భార్య ఎక్కడి తీసుకెళ్తున్నారని ప్రశ్నించగా.. ఇది దైవాజ్ఞ అని చెప్పడంతో ఆమె బదులివ్వదు. ఈ క్రమంలో ఇబ్రహీం వెళ్తుండగా సైతాన్ ఆయనను వెంబడిస్తూ నీవు చేయబోతున్న పని మంచిది కాదు.. కలలో వచ్చి కొడుకును బలిఇవ్వమంటే ఇస్తావా..ఇది న్యాయం కాదు.. నీవు చేయబోతుంది పొరపాటని ఇబ్రహీం మనస్సును సైతాన్ పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తుంది. అయినా ఇబ్రహీం ..సైతాన్ మాటలు లెక్కచేయకుండా దైవ కార్యంలో లీనమై ముందుకు సాగాడు. ఇస్మాయిల్‌ను నిర్జీవ ప్రదేశానికి తీసుకెళ్లాడు. అయితే గొంతుపై కత్తి ఎక్కిపెట్టడానికి తండ్రి సహసించడని భావించిన ఇస్మాయిల్.. కళ్లకు గంతలు కట్టుకుని బలి ఇవ్వాలని తండ్రిని కోరాడు. కుమారుడు చెప్పిన విధంగా ఇబ్రహీం కత్తితో కుమారుడి గొంతుపై ఎక్కిపెట్టే క్రమంలోనే ఇస్మాయిల్ స్థానంతో దుంబ(గొరెపోతు) ప్రత్యక్షమవుతుంది. ఇబ్రహీం ఆ గొర్రెపోతును జుబహ్ చేశాడని గ్రంథాలు చెబుతున్నాయి.

ఖుర్బానీ ప్రత్యేకత..

ప్రతి మనిషి తన ప్రాణ రక్షణ కోసం ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీ. దైవాజ్ఞ మేరకు ఇస్మాయిల్‌ను బలి ఇస్తుండగా ఆయన స్థానంలో (గొర్రెపోతు) ప్రత్యక్షమై ఇస్మాయిల్ ప్రాణాలు రక్షిస్తున్నది. ఖుర్బానీ ఇస్తే ప్రాణాలు, ఆస్తులు రక్షించబడుతాయని ఖుర్బాన్‌లో పేర్కొని ఉంది. దీంతో ఏటా బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఖుర్బానీ(బలి) ఇవ్వడం ఆనవాయితీగా మారింది.

సామూహిక ప్రార్థనలకు సర్వం సిద్ధం

ఈద్గాలో గురువారం ఉదయం 8.30 గంటలకు ఈదుల్ జుహా ప్రత్యేక ప్రార్థనలు జరుగనున్నాయి. బుధవారం స్థానిక కార్పొరేటర్ సిద్ధం రాజు, ఎమ్మెల్యే నరేందర్ ఈద్గాను సందర్శించారు.బల్దియా ఆధ్వర్యంలో ప్రార్థన స్థలం ముస్తాబు చేశాం. ముస్లింలు సకాలంలో హాజరై ప్రార్థనలు చేయాలి.

ఎంఏ జబ్బార్, ఫోర్ట్‌రోడ్డు ఈద్గా ప్రతినిధి

ముస్తాబైన ఈద్గాలు, మజీద్‌లు

ఈదుల్ జుహా నమాజ్ కోసం మసీదులు ముస్తాబయ్యాయి. ఆయా ఈద్గాలు, మజీద్‌ల్లో గురువారం ఉదయం 8 గంటల లోపే ప్రత్యేక నమాజ్ పూర్తిచేయనున్నారు. ఈమేరకు ఆయా మజీద్‌ల కమిటీలు ప్రకటనలు కూడా చేశాయి.

పొట్టేళ్లు రెడీ..



కాజీపేటలో పొట్టేళ్లను విక్రయిస్తున్న వ్యాపారులు

కాజీపేట: బక్రీద్ పండుగ సందర్భంగా పొట్టేళ్ల విక్రయాలు జోరుగా సాగుతాయి. ఈ పర్వదినం సందర్భంగా ఖుర్బానీ ఇవ్వడం ముస్లింల ఆచారం. ఈ క్రమంలో వరంగల్ నగరంలోని అనేక ప్రాంతాల్లో వారం ముందు నుంచే పొటేళ్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ పర్వదినానికి శరీరంపై ఎలాంటి గాయాలు లేని పొటేళ్లనే ఎక్కువగా కొనుగోలు చేయడానికి ఇష్టపడుతుంటారు. ధర ఎంతైనా సరే పొటేళ్లు మాత్రమే కొనుగోలు చేస్తారు.

పొట్టేళ్ల ధర రూ.12వేల వరకు...

బక్రీద్ సందర్భంగా పొట్టేళ్ల ధర రూ.4 నుంచి రూ.12వేల వరకు పలుకుతోంది. ఆరోగ్యంగా, బలంగా ఉన్న పొట్టేళ్లను గొర్రెలకాపరులు అధిక ధరకు విక్రయిస్తున్నారు. కాగా, బక్రీద్ రోజు దాదాపు వరంగల్ నగరంలో 10వేలకు పైగా పొట్టేళ్లు బలి ఇస్తారని ముస్లింలు చెబుతున్నారు.

'జీనోమ్ ఎడిటింగ్'తో విప్లవాత్మక మార్పులు



కాన్ఫరెన్స్‌కు హాజరైన విదేశీ, స్వదేశీ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు

- సైంటిస్టు ఎంజీకే జోన్స్
- కేయూలో రెండో రోజు కొనసాగిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్





మాట్లాడుతున్న ప్రొఫెసర్లు ఎంజీకే జోన్స్, శ్రీల మిత్ర,జెన్నిఫర్ అన్నహరికృష్ణ

కేయూ క్యాంపస్ : మొక్కలలో జన్యుసవరణలతో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని ఆస్ట్రేలియా ముర్డోక్ వర్సిటీ సైంటిస్టు ఎంజీకే జోన్స్ అన్నారు. కేయూలోని సెనేట్‌హాల్‌లో నిర్వహిస్తున్న ప్లాంట్ బయోటెక్నాలజీ 'జీనమ్ ఎడిటింగ్' పై నిర్వహిస్తున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో బుధవారం ఆయన ప్రసంగించారు. 'జీనోమ్ ఎడిటింగ్' ద్వారా సృష్టించిన నూతన వంగడాలను, పంటలను ఏఏ దేశాలల్లో ఎలా ఉపయోగిస్తున్నారనే అంశంతోపాటు వాటి వినియోగం భవిష్యత్తులో ఎలా ఉంటుందో కూడా వివరించారు. అనంతరం పూణేలోని సావిత్రి బాయి పూలే యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీలమిత్ర .. టమాటా మొక్కల అభివృద్ధిలో వివిధ రకాల ఒత్తిళ్లు, కరువు పరిస్థితులను తట్టుకునేలా ఉండే ప్రయోగాలను వివరించారు, ఓయూ ప్రొఫెసర్ కేవీ రావు.. రసం పీల్చే పురుగులు, క్రిమికీటకాలను తట్టుకునే పత్తి, వరి పంటల గురించి వివరించారు. భారతీయర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సతీశ్ కుమార్.. ట్రాన్స్‌జీన్ టెక్నాలజీ, పరిశోధన గురించి వివరించారు. మలేషియా మలయా యూనివర్సిటీ ప్రొఫెసర్ జెన్నిఫర్ అన్న హరికృష్ణ.. జీవసాంకేతిక జన్యుసవరణల పరిశోధనల ద్వారా నిలబడే అరటి మొక్కలను గురించి వివరించారు. బెంగళూర్ టీఎఫ్ఆర్ ఎన్‌సీబీసీ శాస్త్రవేత్త పీవీ శివప్రసాద్.. ఆహార ఉత్పత్తి పెంచడానికి ఉన్న అవకాశాలు వివరించారు. సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రకాశ్ పి కుమార్ మాట్లాడుతూ పంటల అభివృద్ధికి బయో టెక్నాలజీ పరిష్కారమన్నారు. కార్యక్రమంలో కేయూ బయోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్లు ఎస్ రామస్వామి, ఎ సదానందం, వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు రోజారాణి, ఎంవీ రాజం, ప్రశాంత మిశ్రా, కోటా శ్రీనివాస్, కేవీ సరిత, రిటైర్డ్ ప్రొఫెసర్లు చేరాలు, మాధురి, కేయూ బయోటెక్నాలజీ విభాగం అధిపతి వెంకటయ్య, ఏవీ రావు, శాస్త్రీ పాల్గొన్నారు.కాగా, అతిథులు సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు.

ఆకట్టుకున్న పోస్టర్ల ప్రజెంటేషన్స్..

కేయూలో బయోటెక్నాలజీ విభా గం, యూకే అబెర్విసిత్ వెల్స్ యూనివర్సిటీ కొలబరేషన్‌లో ప్లాంట్ బయోటెక్నాలజీ 'జీనమ్ ఎడిటింగ్' అనే అంశంపై నిర్వహిస్తున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో పలువురు పరిశోధకులు పోస్టర్లను ప్ర జెంటేషన్ చేశారు. జీవసాంకేతిక పరిజ్ఞానంతో నూ తన వంగడాలు తదితర అంశాలపై అక్కడికి వ చ్చిన పరిశోధకులు, విద్యార్థులకు తెలిపారు. 25 వ రకు పోసర్లు ప్రజెంటేషన్ చేయగా అందులో ప్రతిభ ప్రదర్శించిన వారికి ప్రోత్సాహకంగా ఈనెల 29న ముగింపు సభలో బహుమతులు అందజేస్తారు.

నేడు ముగియనున్న కాన్ఫరెన్స్

కేయూలో మూడు రోజుల నుంచి జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు గురువారం సాయంత్రం ముగియనుంది. ఈముగింపు సదస్సుకు తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి, కేయూ మాజీ వీసీ విద్యావతి, కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, రాజమండ్రి ఐసీఏఆర్, సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్, కేయూ సైన్స్ డీన్ మల్లారెడ్డి, యూజీసీ కోఆర్డినేటర్ మల్లికార్జున్‌రెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్ తదితరులు హాజరవుతారు.

అతివేగంతో అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం
- కల్వర్టును ఢీకొన్న బైక్.. అక్కడికక్కడే మృతి



సాయికుమార్ మృతదేహం

నర్సంపేట రూరల్ : చివరి సంవత్సరం.. కళాశాలకు చివరి రోజు.. దీంతో ఓ యువకుడు ఉదయమే కాలేజీకి చేరుకున్నాడు. అక్కడ స్నేహితులతో ఆనందంగా గడిపాడు. స్మృతులను నెమరువేసుకుని ఎంజాయ్ చేశాడు. ఫొటోలు దిగిన అనంతరం మిత్రులకు వీడ్కోలు చెప్పాడు. మధ్యాహ్నం వ్యక్తిగత పని నిమిత్తం తన ద్విచక్రవాహనంపై వరంగల్ వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో అతివేగంగా ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న సూచిక బోర్డుతోపాటు కల్వర్టును ఢీకొని కాల్వలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన చింతల చెరువు కుంభం సైదులు, ఉమాదేవి దంపతులకు కుమారుడు సాయికిశోర్ (22), కూతురు వైష్ణవి ఉన్నారు. సాయికిశోర్ వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నెపల్లిలోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగంలో చివరి సంవత్సరం చదువుతున్నాడు. లక్నెపల్లిలో కిరాయికి ఉంటూ రోజూ తన బైక్‌పై కళాశాలకు వెళ్లి వస్తాడు. ఈ క్రమంలో కళాశాలలో చివరి రోజు కావడంతో వైవా పూర్తి చేసుకుని స్నేహితులతో ఆనందంగా గడిపాడు. అనంతరం వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై వరంగల్‌కు వెళ్లి వస్తున్నాడు. అతివేగంగా వస్తూ ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న సూచిక బోర్డుతోపాటు కల్వర్టు ఢీకొని కాల్వలో పడ్డాడు. గమనించిన స్థానికులు 108లో నర్సంపేటకు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు ధ్రువీకరించారు. దీనిపై సమాచారం అందుకున్న నర్సంపేట రూరల్ ఎస్సై సురేశ్ నాయక్ మృతదేహానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం తరలించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కామన్ సర్వీస్ సెంటర్లుగా పీఏసీఎస్‌లు

- పురోగతిలో సహకార సంఘాలు
- రూ.12.92 కోట్ల లాభాల్లో వరంగల్ డీసీసీబీ
- బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ రవీందర్


హన్మకొండ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు చెప్పారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని ప్రైవేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వరంగల్ డీసీసీబీ మహాజన సభ నిర్వహించారు. పూర్వ వరంగల్ జిల్లాల్లోని పీఏసీఎస్ చైర్మన్లు, డీసీసీబీలో సభ్యత్వం కలిగిన చేనేత, గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు. ముందు డీసీసీబీ ప్రగతిని పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం రవీందర్ రావు మాట్లాడుతూ మీ సేవా కేంద్రాలకు దీటుగా పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే కామన్ సర్వీస్ సెంటర్‌ల ద్వారా 300 రకాల సేవలు అందించవచ్చన్నారు. ప్రస్తుతం 30 నుంచి 40 రకాల సేవలు అందించేలా రూపకల్పన చేశామన్నారు. వీటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందన్నారు. పీఏసీఎస్‌లు కేవలం ఎ రువుల వ్యాపారం, ధాన్యం కొనుగోళ్లకే పరిమితం కాకుండా వ్యాపారాన్ని విస్తరించాలన్నారు. వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు విక్రయించాలన్నారు. పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటు చేయాలనే ఆలోచన చేస్తున్నామన్నారు. వరంగల్ డీసీసీబీ గతేడాది రూ.9 కోట్లలో లాభాల్లో ఉండగా ప్రస్తుతం రూ.12.93 కోట్లకు చేరుకుందన్నారు. ప్రగతిలో రాష్ట్రంలోనే వరంగల్ డీసీసీబీ 3వ స్థానానికి చేరుకుందన్నారు. ఈ సందర్భంగా బకాయిలు తీర్చిన 9 పీఏసీఎస్ చైర్మన్‌లను డీసీసీబీ చైర్మన్ రవీందర్ రావు, సీఈఓ చిన్నారావు, జిల్లా సహకార అధికారులు సన్మానించారు. సమావేశంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి, జిల్లా సహకార అధికారులు జి.నాగేశ్వర్‌రావు, మద్దిలేటి, సయ్యద్ ఖుర్షీద్, కిరణ్‌కుమార్, డీసీసీబీ జనరల్ మేనేజర్ బి.శ్రీధర్, జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వెంకటనారాయణ, ఏడీ శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై సమరశీల పోరాటాలు

- రిటైర్డ్ ప్రొఫెసర్ మలిగంటి యాదగిరి చార్యులు

హన్మకొండ: విద్యారంగ సమస్యల పరిష్కారంపై విద్యార్థులు సమరశీల పోరాటాలు చేయాలని రిటైర్డ్ ప్రొఫెసర్ మరిగంటి యాదగిరి చార్యులు పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ ఏకశిలా పార్కు వద్ద నిరాహార దీక్ష చేశారు. దీక్షను యాదగిరి చార్యులు, తెలంగాణ ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌గౌడ్ విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులకు పూలమాల వేసి ప్రారంభించి మాట్లాడారు. విద్యను కాషాయీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానాన్ని తీసుకురావడానికి పూనుకుందని విమర్శించారు. కాగా, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొక్కల నరసింహారావు, కేయూ ఉద్యమకారులు డాక్టర్ మంద వీరస్వామి, సుధాకర్, ఆర్ఎంపీ, పీఎంపీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుర్ర రవీందర్, హనుమకొండ బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ చల్ల శ్రీనివాస్ దీక్షకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఏఐకేఎఫ్ హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ రెడ్డి హంసరెడ్డి దీక్షను విరమింపచేశారు. దీక్షలో నాయకులు మాస్ సావిత్రి, మార్త నాగరాజు, కన్నం సందీప్, గైరామ్, గనిపాక బిందు, కల్లెపల్లి రాకేష్, సంకినేని సాయి, కిరణ్, మెర్గం మోహన్‌సాయి, అజయ్, సాగర్, కల్యాణి ప్రణయ్ పాల్గొన్నారు.

వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తాం : రైల్వే పీసీసీఎం కేఆర్‌కే రెడ్డి



మాట్లాడుతున్న కేఆర్‌కే రెడ్డి

వరంగల్: పంట ఉత్పత్తులు ఎగుమతి చేసే వ్యాపారుల సమస్యలన్నింటిని పరిశీలించి పరిష్కరిస్తామని దక్షిణమధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ కేఆర్‌కే రెడ్డి అన్నారు. వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో సౌత్ సెంట్రల్ రైల్వే బిజినెస్ డెవలప్‌మెంట్ యూనిట్ సమావేశం బుధవారం ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు పీసీసీఎం కేఆర్‌కే రెడ్డి, సీనియర్ టీసీఎం బసవరాజు, సీసీఎం(ఫ్రైట్ సర్వీసెస్) రమేష్‌బాబులు మక్కలు, రైస్, కాటన్, చిల్లీస్ మొదలైన పంట ఉత్పత్తులను వరంగల్ నుంచి ఎగుమతి చేసేందుకు గల అవకాశాలు, వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అంతేగాక వరంగల్ రైల్వే స్టేషన్ చుట్టూ పరిసరాలు అభివృద్ధి కావడంతో రద్దీగా మారడంతో ఇక్కడి గూడ్స్ షెడ్ నుంచి రవాణా సౌకర్యవంతంగా లేనందున చింతలపల్లి గూడ్స్ సైడింగ్‌ను కంటైనర్ టర్మినల్‌గా మార్చితే సౌకర్యవంతంగా ఉంటుందని పలువురు వ్యాపారస్తులు సూచించారు. ఛాంబర్ కోశాధికారి సంపత్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రతినిధులు హరినాథ్, శ్రీనివాస్, వీరారావు, కూకట్ల సత్యనారాయణ, లోలకపురి సురేందర్, అభిషేక్ చౌదరి, చక్రధర్, సంతోష్, రామ్మూర్తి పాల్గొన్నారు.

అర్చక సమాఖ్య కృషితోనే వేతనం పెంపు

- రాష్ట్ర దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ కురాకుల జ్యోతి



మాట్లాడుతున్న జ్యోతి

హన్మకొండ కల్చరల్ : తెలంగాణ అర్చక సమాఖ్య కృషితోనే ధూపదీప నైవేద్య అర్చకులు రూ.6వేల నుంచి రూ.10వేల వేతనం పొందుతున్నారని రాష్ట్ర దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ కురాకుల జ్యోతి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా లష్కర్‌బజార్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో వరంగల్‌జోన్‌లోని దేవాదాయ ధర్మాదాయశాఖ పరిధిలోని కరీంనగర్, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల 6ఏ, 6బి, 6సీ దేవాలయాలు, ధూపదీప నైవేద్య అర్చకులతో ఆత్మీయ సమ్మేళనం, అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జ్యోతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అర్చకులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉందన్నారు. వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతారావు మాట్లాడుతూ దేవాలయాల ఆవరణలు పచ్చదనం, పరిశుభ్రతతో ఉండాలని అప్పుడే భక్తిభావన కలుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ధూపదీప నైవేద్య అర్చకసంఘం అధ్యక్షుడిగా నిట్టూరి సతీష్‌శర్మను ఎన్నుకున్నారు. ఆరు జిల్లాల అసిస్టెంట్ కమిషనర్లు సులోచన, సుప్రియ, చంద్రశేఖర్, సునీత, నవీన్, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, అర్చక జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, జాక్ కన్వీనర్ డీవీఆర్ శర్మ, సమాఖ్య కార్యదర్శి రత్నాకర్, ఉద్యోగుల సంఘం అర్చకులు కృష్ణమాచారి, రవీంద్రాచారి పాల్గొన్నారు.

అర్చకులకు అవగాహన సదస్సు..

వేదపండితులు నాగిళ్ల షణ్ముఖశర్మ, జితేందర్‌శర్మ, సుహాస్‌శర్మ, వజ్రయ్య, సంపత్‌కుమార్‌శర్మ.. 21 కులాలకు చెందిన అర్చకులకు ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దేవత విగ్రహాలకు ధూప, దీపాలు, నైవేద్యాలు సమర్పించడం, యాగాలు, పూజలు ఎలా చేయాలో శిక్షణ ఇచ్చారు.

బీసీల మధ్య చిచ్చుపెడుతున్న ప్రభుత్వం

- మండిపడిన బీసీ సంఘాల నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్, పాల్గొన్న బీసీ నాయకులు

హన్మకొండ : బీసీలకు రూ.లక్ష ఇస్తామంటూ బీసీ కులాల మధ్య ప్రభుత్వం చిచ్చు పెడుతుందని బీసీ సంఘాల నాయకులు మండిపడ్డారు. బుధవారం రాత్రి హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో బీసీల వ్యూహరచన సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు రాజ్యాధికారం దిశగా చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. ప్రస్తుత రాజకీయాలపై చర్చించి బీసీల రాజకీయ నిర్మాణం అనివార్యమనే నిర్ణయానికి వచ్చి ప్రత్యేక పార్టీ ఏర్పాటు దిశగా ఆలోచించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈదునూరి రాజమొగిళి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వరంగల్ పూర్తిగా వెనుకబడిపోయిందని, ఇక్కడ మురికివాడలు పెరిగాయని, పేదలకు నేటికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందలేదని, అట్టడుగు అణగారిన వర్గాలు వరదల్లో చిక్కుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీల రాజకీయ నిర్మాణాన్ని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చేపడుతున్నామన్నారు. వరంగల్‌లో మరోసారి బీసీ ముఖ్య నాయకుల విస్తృత సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో గాజు యుగేందర్ యాదవ్, శ్రీకాంతా చారి, బండారి రవీందర్, బొల్లంపల్లి సారయ్య, తెలంగాణ కొమురయ్య, కేడల ప్రసాద్, పైండ్ల భిక్షపతి, పాదిల రాజు పాల్గొన్నారు.